సాక్షి చిత్తూరు

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



దేశం గర్వించే మహనీయుడు

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు ఎనలేనివని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కీర్తించారు. - 8లో



రేషన్ స్మగ్లింగ్‌కు ఖాకీల దన్ను!

రేషన్ బియ్యం స్మగ్లర్లకు కొందరు పోలీసులు అండగా నిలవడంపై ఎస్పీ మణికంఠ చందోలు కన్నెర్ర చేశారు. - 8లో



పంటలపై ఏనుగుల దాడులు

బంగారుపాళెం మండలంలో మరోసారి పంటలపై ఏనుగులు స్వైరవిహారం చేసి నష్టం కలిగించాయి. - 8లో

న్యూస్‌రీల్

పీఎం సహాయ నిధి మంజూరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇద్దరు బాధితులకు పీఎం సహాయ నిధి మంజూరు చేశారు. ఈ మేరకు రాజంపేట ఎంపీ కార్యాలయం నుంచి వివరాలను శుక్రవారం వెల్లడించారు. జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మండలానికి చెందిన కృష్ణారెడ్డికి రూ.3 లక్షలు, పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఇరికిపెంట గ్రామానికి చెందిన గగన్‌కుమార్‌కు రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షలు మంజూరు చేశారు. పీఎం సహాయ నిధికి సహాయ సహకారాలు అందించిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బాధిత కుటుంబాలు ధన్యవాదాలు తెలిపారు.

తాగునీటికి రూ.30 లక్షలు

కుప్పం(రామకుప్పం): కుప్పం నియోజకవర్గంలోని ప్రతి మండలానికీ తాగునీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా పరిషత్ నిధుల ద్వారా రూ.30 లక్షలు కేటాయించనున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అధికార సమావేశంలో ఆయన మాట్లాడారు. రామకుప్పం మండల పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సమస్య పట్ల చర్చించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య తీవ్రం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ నితిన్ పాల్గొన్నారు.

వినాయకపురం

చౌక దుకాణం గోల్‌మాల్ !

చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు నగరంలోని వినాయకపురంలోని 41వ చౌక దుకాణంలో జరిగిన గోల్‌మాల్‌పై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం కొరడా ఝులిపించారు. భారీ బియ్యం కుంభకోణాన్ని గుర్తించిన అధికారులు పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ 2018, ఈసీ యాక్ట్ 1955 కింద 6ఏ కేసు నమోదు చేశారు. డీఎస్‌ఓ శంకరన్ వివరాల మేరకు.. వినాయకపురంలోని 41 చౌక దుకాణంలో రేషన్ బియ్యం ఇవ్వకుండా కోత పెడుతున్నారని కార్డుదారులు గగ్గోలు పెట్టారు. గట్టిగా అడిగితే బియ్యం లేదని చేతులెత్తేస్తున్నారని గొడవకు దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన కార్డుదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్డుదారులు తమ బాధలను వెలగక్కారు. ఈ విషయంపై కథనాలు ప్రచురితం కావడంతో ఆ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. షాపుపై విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఆర్‌ఓ క్షుణంగా పరిశీలించారు. బియ్యం 3,700 కిలోల ఉండాల్సి ఉండగా కేవలం 146 కిలోలు మాత్రమే చేతికి చిక్కాయి. చక్కెర 28 కిలోలు తేడా కనిపించాయి. దీంతో అధికారులు డీలర్ యామినిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్డీఓ సమక్షంలో షోకాజ్ నోటీసులు జారీ చేసి సస్పెండ్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే చౌకదుకాణం నిర్వహణ బాధ్యతలను వీఆర్‌ఓకు అప్పగించామని వివరించారు.


చిన్నారుల ఆరోగ్యమే ధ్యేయం



ముక్కలతూరు సచివాలయాన్ని సందర్శించిన కోఆర్డినేటర్ శిరీష, ఎస్‌ఓ రామ్మోహన్

గంగాధర నెల్లూరు : పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వయసు వరకు ఉన్న పిల్లలందరికీ ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడమే ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం) లక్ష్యమని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, ఎస్‌ఓ రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండల పరిధిలోని ముక్కలతూరు సచివాలయాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సందర్శించింది. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. చిన్నారుల సమగ్ర ఆరోగ్య రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. చిన్నారులలో ఏవైన ఆరోగ్య సమస్యలు ఉంటే సకాలంలో చికిత్స అందే విధంగా చూస్తామన్నారు. పుట్టుకతో వచ్చే సమస్యలు, వ్యాధులు, ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించడం కోసం తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సచివాలయంలో అందిస్తున్న సేవలు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చిత్తూరు కార్పొరేషన్ : నాలుగో తరగతి ఉద్యోగుల డీఏ బకాయిలు విడుదల చేయాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జీపీఎఫ్, ఏపీజీఎల్‌ఐలు, సరెండర్ లీవుల బకాయిలు సైతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఖాళీగా ఉన్న అటెండర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లా నాయకులు మునికృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ఉమాపతి, హరికృష్ణా, రామచంద్రయ్య, వెంకటేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



- బంగారుపాళ్యంకు చెందిన దీప అనే గర్భిణి రెండు నెలల కిందట ప్రసవం కోసం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించింది. భరించలేని నొప్పులతో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు సక్రమంగా పట్టించుకోకపోవడంతో కుటుంబికులు చిర్రెత్తిపోయారు. అక్కడి సిబ్బందిపై గొడవకు దిగారు. దీంతో కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని..వెంటనే ఎక్కడైనా చూపించుకోమని ఆ సిబ్బంది సమాధానమిచ్చి చేతులు దులుపుకున్నారు. హుటాహుటిన కుటుంబికులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా సుఖ ప్రసవం అయింది.
- వారం రోజుల కిందట గాయత్రి అనే గర్భిణి భరించలేని నొప్పులతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆస్పత్రిలో చేరిన మరుసటి రోజు కూడా నొప్పులు తగ్గలేదని అక్కడి సిబ్బందిని అడిగితే ఏమాత్రం పట్టించుకోలేదు. ఆ తర్వాత ఓ డాక్టర్ సిఫార్సుతో స్కానింగ్‌కు తీసుకెళ్లారు. దీంతో బిడ్డ పరిస్థితి బాగోలేదని చెప్పి భయపెట్టించారు. వేరు చోటకు వెళ్లి చూపించుకోమని సలహా ఇచ్చారు. దీంతో చేసేదీ లేక భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారు. అయితే అక్కడి డాక్టర్ బిడ్డ బాగుందని నివేదిక ఇచ్చారు.
- గంగాధర నెల్లూరు మండలానికి చెందిన కుసుమ (పేరు మార్చాం) మొదటి ప్రసవం సుఖ ప్రసవమైంది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించారు. అయితే రెండో ప్రసవానికి అక్టోబర్ నెలలో స్థానిక పీహెచ్‌సీకి వెళ్లారు. నొప్పులు అధికంగా ఉన్నాయని ఇక్కడ కాదని జీహెచ్‌కు వెళ్లిపోవాలని అక్కడి సిబ్బంది సూచించారు. చేసేదీ లేక రూ. 30 వేలు ఖర్చుపెట్టి ప్రైవేటు ఆస్పత్రిలో ప్రసవం చేయించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ప్రహసనంగా మారాయి. గర్భిణులకు కడుపు కోతలను మిగులుస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రసవ లక్ష్యానికి దూరంగా నిలిచాయి. గర్భిణులను భయపెట్టి రెఫర్‌లు చేస్తున్నారు. వైద్యసేవలు పూర్తిగా గాడి తప్పుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ తరుణంలో ప్రసవానికి ప్రైవేటు ఆస్పత్రులే దిక్కుగా మారుతున్నాయి. ప్రసవ లక్ష్యాన్ని అధిగమించే క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ప్రసవం.. ప్రహసనం



ఆస్పత్రుల్లో తల్లులు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడిపోతున్న ప్రసవాలు
- రెఫర్ కేసులే అధికం
- పీహెచ్‌సీల్లో ప్రసవాలు శూన్యం
- ప్రైవేటు ఆస్పత్రులే దిక్కువుతున్న వైనం
- పట్టించుకోని జిల్లా అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు 1500, ఒక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, 4 ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లు, 50 పీహెచ్‌సీలున్నాయి. ఈ పరిధిలో ప్రతినెల 1800 నుంచి 1900 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలనెల 700 దాటుతుంటే..ప్రైవేటు ఆస్పత్రుల్లో 800 మించుతోంది. ఈ సంఖ్య పెరుగుతూ వస్తున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రసవ సమయానికి చేతులెత్తేస్తున్నారు..

గర్భిణి నమోదు నుంచి ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్త దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. తీరా పీహెచ్‌సీలు, వైద్య విధాన పరిషత్‌లకు సైతం తీసుకెళుతున్నారు. అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నారు. మందులు, మాత్రలు అందిస్తున్నారు. స్కానింగ్‌లు తీస్తున్నారు. ప్రసవం సమయం వచ్చేసరికి చేతులెత్తేస్తున్నారు. అరకొరగా మాత్రమే ప్రసవ సేవలు చేస్తున్నారు. చాలా వరకు రెఫర్ కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. చాలా మంది ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చూసుకుంటే..భారం పడుతుందని భావిస్తూ...ప్రైవేటు ఆస్పత్రి మేలంటూ సలహాలు ఇస్తున్నారు.

వైద్యుల కిట్లు లేక..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాక్టర్లకు కనీస వసతులు, సౌకర్యాలు కరవుతున్నాయి. డాక్టర్లకు ఉండాల్సిన కిట్లు కూడా చాలా వరకు ఉండడం లేదు. ఈ కారణంగా ప్రసవం చూసేందుకు డాక్టర్లకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. పూర్తి స్థాయిలో వసతులు, సౌకర్యాలు, కిట్లు, పరికరాలు ఉంటే రెఫర్ కేసులను తగ్గించవచ్చునని మరోవైపు వైద్యులు చెబుతున్నారు.

భయపెట్టి..రెఫర్ చేస్తున్నారు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవ సేవల్లో చాలా వరకు నిర్లక్ష్యం దాపురించింది. గర్భిణుల పురిటి నొప్పులను తేలికగా తీసుకుంటున్నారు. భయపెట్టి రెఫర్‌లు చేసేస్తున్నారు. ఉమ్మనీరు లేదని, తగ్గిపోయిందని, మధుమేహం, ఫిట్స్, రక్తం తక్కువగా ఉందని, మాయ సమస్య, గర్భం జారిపోవడం, బిడ్డ అడ్డం తిరగడం, గర్భకోశం పగిలిపోవడం, కిడ్నీ, బిడ్డ తక్కువ బరువు ఉందని, నెల తక్కువగా పుట్టడం, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నాయని తదితర సమస్యలను సాకుగా చూపి రెఫర్‌లు చేస్తున్నారు. ఇక చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ కిట్లు కొన్ని





యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పీహెచ్‌సీలో ప్రసవ గది

బయట తీసుకురావాలని చీటీ రాయిస్తున్నారు. ఈ ఖర్చులు ఇటీవల కాలంలో పెరిగాయి. దీంతో చాలా మంది ప్రభుత్వ ఆసుపత్రికి రావడం బదులు...ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడమే ఉత్తమమని వెళ్లిపోతున్నారు. మరికొంత మంది వారు చెప్పే కారణాలు భయపెట్టేలా ఉండడంతో డబ్బులు పోయినా పర్వాలేదు..ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిపోదామని పరుగులు పెడుతున్నారు. మరికొంత మంది స్కానింగ్ రిపోర్ట్‌లు తప్పుల తడకగా ఉండడంతో ఉలిక్కి పడి డిశ్చార్జ్ చేసుకుంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఇంకొంత మంది దేవుడి మీద భారం వేసి...ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చూస్తున్నారు.

ప్రసవ వివరాలు

నెల	ప్రభుత్వ ఆస్పత్రులు	ప్రైవేటులో
సెప్టెంబర్	854	850
అక్టోబర్	585	853
నవంబర్	870	864
డిసెంబర్	792	803
జనవరి	715	731

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసింది. అందులోనూ గర్భిణుల సేవలకు అండగా నిలిచింది. రక్తహీనత లోపం ఉన్న గర్భిణులకు వాహన సేవలను కేటాయించింది. ఆస్పత్రికి తీసుకెళ్లి..వైద్యం చేయించేలా చేసింది. పర్యవేక్షణను పకడ్బందీగా అమలు చేసింది. కావాల్సినన్ని మందులు, మాత్రలు సరఫరా చేసింది. పీహెచ్‌సీల్లోనే ప్రసవం చూడాలని ఆదేశాలు జారీ చేసింది. పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకుని.. మాతా శిశు మరణాలను నివారణకు కృషి చేసింది. రెఫర్ కేసులు ఉండకూడదని పదే పదే హెచ్చరిస్తూ వచ్చింది. ఇప్పుడు ఈ సేవలు పూర్తిగా తారుమారు అయ్యాయని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాడితప్పిన ఆరోగ్య కేంద్రాలు

గత ఆరు నెలల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు పూర్తిగా గాడి తప్పాయి. గర్భిణుల సేవలను విస్మరించారు. ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయాలనే నిబంధన ఉన్న ఆ దిశగా ఎవరు పట్టించుకోవడంలేదు. ప్రధానంగా పీహెచ్‌సీ స్థాయిలో గర్భిణుల విషయంలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. అధికారులు పర్యవేణలోపం కొరవడుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీట్లకు పరిమితమవుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. ఇలానే కొనసాగితే ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంది.

మార్పు తీసుకొస్తాం



ఆరు నెలల కాలంలో ప్రభుత్వం సరికొత్త విధానాన్ని తీసుకురానుంది. ఆ విధానం కుప్పంలో అమలు కానుంది. ఆ తర్వాత నిర్లక్ష్యం కనిపించదు. పీహెచ్‌సీలో ప్రసవ విషయాలను చూస్తాం. పర్యవేక్షణ విషయానికి వస్తే..కార్యాలయంలోనే ఆ పనులు.. ఈ పనులు సరిపోతున్నాయి. ఏవైనా సమస్యలు వస్తే చూస్తాం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

సెటిల్‌మెంట్ రిజిస్ట్రర్లు పూర్తి చేయండి

- విధుల్లో అలసత్వం చూపొద్దు
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తహసీల్దార్‌లు మూడు వారాల్లో సెటిల్‌మెంట్ రిజిస్టర్‌లు పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని డీకేటీ, ప్రభుత్వ, వెబ్ ల్యాండ్, దేవాదాయ, కోర్టుల్లో ఉన్న భూములకు సంబంధించిన సెటిల్‌మెంట్ రిజిస్టర్లు మూడు వారాల్లో పూర్తి చేయాలన్నారు. సెటిల్‌మెంట్ రిజిస్టర్‌లలో ఏవైనా తప్పిదాలు ఉంటే వెంటనే వాటిని సరిదిద్దాలన్నారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ రీ సర్వే పెండింగ్ ఉందనే విషయాలను తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో సర్వే నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో తెలియజేయాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13 గ్రామాల్లో ఎఫ్‌పీఓయల్‌ఆర్ ప్రక్రియ పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం రీ సర్వేలో ప్రభుత్వ భూములు, గ్రామాల వారీగా హద్దులు గుర్తించడంలో ఎలాంటి తప్పిదాలు జరగకూడదన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు మండల సర్వేయర్లు, ఆర్ఎస్ డీటీలు, వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్‌లతో రీ సర్వే పై సమీక్ష ఉంటుందన్నారు. బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

దౌర్జన్యాలను ఎదిరిస్తాం.. అభివృద్ధిని స్వాగతిస్తాం

- బస్టాండ్ స్థలం కొట్టేయాలని కుట్ర
- ఆకాశంలో తిరిగేవాళ్లకు పేదల కష్టాలు తెలియవు
- చిరు వ్యాపారుల జోలికి వస్తే సహించం
- చిత్తూరు పాత బస్టాండు వ్యాపారులదే
- గేటు పేరిట కూటమి నేతలు.. పేదల రక్తాన్ని తాగుతున్నారు
- చిత్తూరులో చిరు వ్యాపారులతో కలిసి వైఎస్సార్‌సీపీ నిరసన
- కూటమి నేతలపై నిప్పులు చెరిగిన భూమన, విజయ్





హాజరైన వ్యాపారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, (ఇన్‌సెట్) విజయానందరెడ్డితో కలిసి మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

చిత్తూరు అర్బన్ : 'ఛార్టెడ్ ఫ్లెటైట్ (అద్దె విమానాల్లో) లలో విహరించే వాళ్లకు పేదల కష్టం తెలియదు. చిత్తూరులో ఎమ్మెల్యే చేష్టలకు ఇదే ప్రత్యక్ష సాక్ష్యం. 56 ఏళ్లకు పైగా పాత బస్టాండులో వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఎలా బయటకు పొమ్మంటారు.? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని అడ్డుకోదు.. కూటమి నేతల దౌర్జన్యాలను అడ్డుకుంటుంది. కచ్చితంగా ప్రశ్నిస్తుంది.. ప్రజల గొంతుక అవుతుంది. చిత్తూరు పాత బస్టాండు వ్యాపారుల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తేలేదు.' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, చిత్తూరు సమన్వయకర్త ఎంసి.విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు నగర బొడ్డున ఉన్న పాత బస్టాండులో మూడు దశాబ్దాల కిందటే మార్కెట్ ధరను చెల్లించి స్థలాలకు పట్టాలు పొందారని, ఇప్పుడు వ్యాపారులను దౌర్జన్యంగా బయటకు పంపించి, బస్టాండును కబ్జా చేసే కుట్ర జరుగుతోందన్నారు. పాత బస్టాండు వ్యాపారులపై కూటమి నేతలు, కార్పొరేషన అధికారుల దౌర్జన్యాలను నిరసిస్తూ శుక్రవారం విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా, భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. వందల మంది వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసి నిరసన చేపట్టారు.

ధనికులకు బస్టాండు అప్పగించే కుట్ర

కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని వంచించిందన్నారు. ధనికులకు కొమ్ముకాసిన చంద్రబాబు , పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు. చిత్తూరులో చిరు వ్యాపారులను సర్వనాశనం చేసి, ధనికులకు బస్టాండు అప్పగించడమే సంపద సృష్టించడమా..? అని నిలదీశారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వారి వరకు దేశంలో ఎక్కడా లేని విధంగా గత అయిదేళ్లల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల కోసమే రూ.3.28 లక్షల కోట్లు వెచ్చించారన్నారు. చిత్తూరు బస్టాండు విషయం మాజీ సీఎం జగన్ దృష్టిలో కూడా ఉందని, అవసరమైతే ఆయన దీనిపై పోరాటం చేస్తారన్నారు. అధికారులు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు

దేశ అధ్యక్షులే ఎలాన్ మస్క్ అపాయింట్ కోసం వేచి చూస్తుంటే, ఆయనతో మాట్లాడి ఇక్కడ పెట్టుబడులు పెట్టిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చిత్తూరులో కూటమి నేతలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లు తగలబెట్టి దాడులు చేసి, బేకరీ ధ్వంసం చేశారు. ఆర్యవైశ్యుల గోదాం కాల్చేసి, అతని ఆత్మహత్యకు కారణమయ్యారు. ఎమ్మెల్యేకు పాలన చేతకాకుంటే పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు దొరబాబన్న, చంద్రప్రకాష్‌ను అడిగి సలహాలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తే వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందన్నారు. దేశంలో నెంబర్ వన్‌గా ఉన్న అమూల్ డెయిరీను చిత్తూరులో పెట్టిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వం గొప్పతనం అన్నారు. దేశంలో ఏడో స్థానంలో ఉన్న సీఎంసీని ఇక్కడ నెలకొల్పిన చరిత్ర వైస్సార్‌సీపీదన్నారు. కూటమి ప్రభుత్వం లా ఫిషరీస్ స్థలాన్ని కబ్జా చేయలేదు.. పీసీఆర్ విద్యా సంస్థలను ఆక్రమించలేదు.. ఇప్పుడు రూ.500 కోట్ల విలువైన బస్టాండు స్థలాన్ని కొట్టేయాలని చూస్తున్నారని ఇది ముమ్మాటికీ జరగదని హెచ్చరించారు. వ్యాపారుల జోలికి వస్తే ఖబడ్దార్.. అంటూ నిప్పులు చెరిగారు. ఆందోళన కార్యక్రమంలో పూతలపట్టు సమన్వయకర్త డా.సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, పార్టీ నేతలు శ్రీధర్, ప్రకాష్, జయపాల్, గాయత్రీదేవి, మధు పాల్గొన్నారు.

పేదల రక్తం తాగుతున్నారు..

విజయానందరెడ్డి మాట్లాడుతూ.. 'నేను మార్కెట్‌కు రూ.35 లక్షలు ఎగ్గొట్టానని రాశారు. అయిదేళ్లలో రూ.4 కోట్లకు పైగా గేటు చెల్లించి, ఏ ఒక్క వ్యాపారి నుంచి రూపాయి తీసుకోకుండా ఉచితంగా సేవ చేశాను. కానీ ఇప్పుడు ఏం జరుగుతా ఉంది.? చిత్తూరులో గేటు పేరిట కూటమి నేతలు పేదల రక్తాన్ని పీల్చేస్తున్నారు. తట్టకు రూ.100, బుట్టకు రూ.300, ఆటోకు రూ.1000, లారీకి రూ.3 వేలు చొప్పున రోజుకు రూ.3 లక్షలు, నెలకు రూ.90 లక్షలు దోచుకుంటున్నారు. అధికారులు ఏం చేస్తున్నారు..? అంటూ అసహనం వ్యక్తం చేశారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌తోనే ప్రమాదాలు

– జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ నిరంజన్ రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

గంగాధర నెల్లూరు : ప్రమాదాలను నివారించాలంటే వాహన చోదకులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని భానోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డీటీసీ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. అతివేగం నిర్లక్ష్య డ్రైవింగ్‌తో జిల్లాలో ప్రమాదాల స్థాయి పెరిగిందన్నారు. మలుపుల వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేసినప్పటికీ అతివేగం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత, హైల్మెట్ పెట్టుకోకుండా ద్విచక్ర వాహనాలు వేగంగా నడపటం , మద్యం మత్తులో వాహనాలు నడపటం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆర్టీఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రమాదాలపై వాహన చోదకులు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వ్యాస రచన, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. చివరగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు లావణ్య , నరసింహులు, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

1400 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కుప్పం : రామకుప్పం మండలం పులిమడుగు కొత్తూరు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి నిల్వ ఉంచిన 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ సీఐ నాగరాజు తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించగా సారా తయారీకి 7 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో రామకుప్పం మండలం మిట్టపల్లి క్రాస్ వద్ద 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. నియోజకవర్గంలో అక్రమ మద్యం వ్యాపారానికి పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇలాంటి అక్రమ మద్యం వ్యాపారాలపై సమాచారాన్ని 98853 99789,94419 49568 నంబర్లకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ పేర్కొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు


అతిథులతో వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ సావేరీ సెమినార్ హాల్ వే ధీటకగా పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్ అండ్ ఫైలింగ్ విధానాలపై గత ఐదు రోజులుగా జరిగిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎన్ఐ-ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప, ఎన్ఆర్‌డీసీ హెడ్ డాక్టర్ బిజాయ్ కుమార్‌షా, ఐఐటీ చెన్నైకి చెందిన డాక్టర్ దారా అజయ్ పాల్గొని పరిశోధనలకు, ఆవిష్కరణలకు పేటెంట్ హక్కుల ప్రాధాన్యతపై వివరించారు. అనంతరం అతిథులను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని మర్యాద పూర్వకంగా కలసి సదస్సుపై చర్చించారు. సదస్సు ఆర్గనైజర్ ప్రొఫెసర్ డీఎం మమత, అధ్యాపకులు పాల్గొన్నారు.

'అక్ర'మార్కుడు



- ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్త ఓవర్ యాక్షన్
- అక్రమాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న నేత
- కేసులు కాకుండా అడ్డుకుంటున్న వైనం
- రెచ్చిపోతున్న ఓ వర్గం కూటమి నేతలు
- అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు
- తిరగబడేవారిపై అక్రమ కేసుల బెదిరింపులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమిలోని ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్త రెచ్చిపోతున్నాడు. కర్ణాటక మద్యం, గ్రూపు రాజకీయాలు నడుపుతూ పట్టు నిలుపుకునేం పాకులాడుతున్నాడు. బాస్‌తో పాటు ఆ వర్గం అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నా అక్రమార్కులకు రక్షణ కవచంగా నిలబడుతున్నాడు. దీంతో మండలంలో ఆ వర్గం అడ్డు అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురి చేస్తోంది. చిరుద్యోగుల కడుపుకొడుతోంది.

బాస్‌ను టచ్ చేస్తే..

ఆ బాస్‌కు అధికారం, పదవి ఉంటే మాత్రమే మండలంలో తలుక్కుమంటుంటారు. ఆ తర్వాత పూర్తిగా కనుమరుగవుతుంటారు. ఓ ప్రజాప్రతినిధి భర్తగా గతంలో అయిదేళ్ల పాటు జిల్లాను శాసించారు. తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. కనుమరుగయ్యే ప్రయత్నంలో పడిపోయారు. దీంతో మండలాన్ని వదిలించుకోవాలని. టీడీపీ సమీక్షా సమయంలో ..నేను ఏం సంపాదించుకోలేదు. కనీసం గౌరవం లేదు. నారా లోకేష్‌ను కలిసేందుకు వెళ్లిన పట్టించుకోలేదంటూ నాయకుల ముందు మొసలి కన్నీరు కార్చారు. మరుసటి రోజు బెంగుళూరుకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి మండలాన్ని అసలు పట్టించుకోలేదు. పూర్తిగా విస్మరించారు. మండల కేడర్‌ను గాలికొదిలేశారు. దీంతో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పూర్తిగా రగిలిపోయారు. ఎన్నికలొచ్చే సరికి చిత్తూరు టిక్కెట్ ఆశించే ప్రయత్నంలో పడ్డారు ఆ బాస్. తనకే సీటు అంటూ ప్రచారం మొదలుపెట్టారు. కొంత మందిని వెంటేసుకుని తన బలాన్ని చాటుకోవాలని విశ్వ ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేపై కూడా తప్పుడు ప్రచారాలు చేయించారు. సీటు తనకే దక్కాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ముత్తుకూరుకు వచ్చారు. అప్పుడు స్థానిక నాయకులు, కార్యకర్తలు పూర్తిగా మాజీ ప్రజాప్రతినిధి భర్తను వ్యతిరేకించారు. ఇన్నాళ్లు కనిపించని ఆ నాయకుడు మాకెందుకంటూ ఆ సభ వేదికలోనే రగిలిపోయారు. అక్కడున్న మరో మండల నేత కల్పించుకుని ఇప్పుడు గొడవలు వద్దని సర్ది చెప్పారు.

ఫిర్యాదుల పరంపర..

కూటమి అధికారంలోకి రావడంతో అంతా ఆ బాస్ చుట్టూ రాజకీయం నడుస్తోంది. చిరుద్యోగుల మెడపై కత్తిపెట్టారు. తర్వాత సీసీ రోడ్ల విషయంలో తన వర్గానికి అధిక శాతం ఇవ్వాలని పట్టుపట్టారు. అనాధికారికంగా రోడ్డు వేసి ప్రజాధనాన్ని లూటీ చేయాలని చూశారు. వాటికి బిల్లులు పెట్టాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అలాగే భూ ఆక్రమణ విషయంలో మాజీ అనచరుడు తహసీల్దార్‌ను బెదిరించాడు. అలాగే ఎంపీడీఓకు గోకులం షెడ్డుకు బిల్లులు పెట్టించాలని ఒత్తిడి తెచ్చారు. చేసేదీ లేక ఆ మండల అధికారి బిల్లు పెట్టేందుకు సిద్ధమయ్యారు. పీడీ వద్ద నుంచి సిఫార్సు వచ్చింది...తాము ఏం చేయలేమని.. అధికారం ఉండేది వాళ్లదే కదా అంటూ మిన్నకుండిపోయారు. ఇలా అధికారులు ఆ ప్రజాప్రతినిధి భర్త ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారు. మాట వినకుంటే భయపెట్టిస్తున్నారు. పోలీసులు సైతం ఆయన సిఫార్సుతో కేసులను మాఫీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఆయన వర్గానికి పార్టీలో ఎవరు అడ్డొచ్చిన బెదింపులతో పాటు దాడులకు పాల్పడుతున్నారు. ఎన్నికలు వచ్చిన కొంత కాలంలోనే ఇదే పార్టీకి చెందిన యువ నాయకుడిపై దాడికి యత్నించారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా... బడా నాయకుల పంచాయతీతో కేసు సద్దుమణిగింది. ఇప్పుడు కూడా ఆయన వర్గానికి అడ్డొస్తే అడ్డు తొలగించి.. మండలంలో పట్టు నిలుపుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారని మరో వర్గం కోడైకూస్తోంది.

పట్టునిలుపుకునేందుకు..

కూటమి అధికారంలోకి వచ్చాక పట్టు నిలుపుకునేందుకు ఆ నేత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మరోమారు ఆ మాజీ సీటు కోసం కుస్తీ పడుతున్నారు. ఈ ఫలితంగా మండల రాజకీయానికి పదును పెడుతున్నారు. జిల్లా స్థానం మళ్లీ తనదేనని ప్రచారం చేయించుకుంటున్నారు. సీట్లో కూర్చున్న తర్వాత ప్రస్తుత ప్రజాప్రతినిధి, మరో వర్గానికి చుక్కలు చూపిస్తానని ఊగిపోతున్నట్లు బాస్ వర్గం వెల్లడిస్తోంది. కాగా తన వర్గాన్ని కాపాడుకునేందుకు అడ్డదిడ్డంగా వ్యవహరిస్తూ అధికారులకు నరకం చూపిస్తున్నారు. అక్రమ కేసుల్లో ఇరుక్కున అంతా తానై వ్యవహరిస్తూ...కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రజాప్రతినిధిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ...తనకు పై స్థాయిలో పవర్ ఉందని సొంతంగా డబ్బా కొట్టుకుంటున్నాడు. అయితే అదే సీటుపై మరో ఇద్దరి నేతల కన్ను పడింది. వారు కూడా గట్టిగా ఆ సీటు కోసం ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారని పలువురు టీడీపీ నేతలు చెబుతున్నారు.

- చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసిన కళావతి సంతకం ఇటీవల ఫోర్జరీ చేశారు. జనవరి 20న తాలూకా పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ ప్రారంభించిన పోలీసులు అయిదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కేసులో ఓ వీఆర్పీ కూటమి నేత సోదరుడు, అందులోనూ మాజీ ప్రజాప్రతినిధి భర్త అనుచరుడు కావడంతో విచారణలో జాప్యం అవుతోంది. ఈ కేసులో ఫోర్జరీకి పాల్పడ్డ వ్యక్తులు స్పష్టంగా భయటపడినా పోలీసులు వారిని అరెస్ట్ చేసేందుకు ఆయనకు భయపడుతున్నట్లు ఆ వర్గం నాయకులే బాహాటంగా చెబుతున్నారు.

- దిగువకండ్రిగ గ్రామంలో గతవారం ఎర్రచందనం కలకలం రేపింది. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అటవీశాఖ అధికారులు ఆ దుంగలను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న కొద్ది సేపటికే అతని వదిలిపెట్టాలని ఆ నేత నుంచి సిఫార్సు మొదలైంది. ఈ విషయం ఆ నోటా..ఆ నోట పడి మండలం మొత్తం వ్యాపించింది. దీంతో చేసేదీ లేక శాఖ అధికారులు రిపోర్ట్ రాసి ఉన్నతాధికారుల ముందు పెట్టారు. అయితే ఆ నేత ఒత్తిడితో శాఖ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. అది ఏగిసనా ? ఎర్రచందనమా..?..శ్రీగంధమా తేల్చాలని సాగ దీస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

- చిత్తూరు మండలం ఎగువమాసాపల్లి గ్రామంలోని ఓ గ్రామ కంత భూమిని స్థానిక టీడీపీ నేత ఆక్రమించుకున్నాడు. ఆ భూమిలో మినీ గోకులం షెడ్డు నిర్మించుకున్నాడు. దీనిపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించి తహసీల్దార్ అది గ్రామకంత భూమి అని దీనిపై ఎవరి పెత్తనం లేదని తేల్చారు. ఎంపీడీఓ కూడా నోటీసులు ఇచ్చారు.ఇంత జరిగాక మళ్లీ షెడ్డు పనుల నిర్మాణం జరగడం, అందుకు బిల్లు చెల్లింపులు చేయాలని మాజీ ప్రజాప్రతినిధి భర్త మండల స్థాయి అధికారులను ఒత్తిడి తెచ్చారు. మంగళవారం విచారణ చేపట్టిన తహసీల్దార్ మాజీ ప్రజాప్రతినిధి భర్త జోక్యంతో కథను అడ్డం తిప్పారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

బంగారుపాళెం : మండలంలోని ఎగువకంతల చెరువు గ్రామంలో గురువారం రాత్రి పంట పొలాలపై ఏనుగులు దాడులు చేసి పంట నష్టం చేశాయని బాధితులు వాపోయారు. రైతు భాస్కర్‌కు చెందిన వ్యవసాయ బావి వద్ద పైపులు విరగొట్టగా మునికృష్ణ, వెంకటేష్‌కు చెందిన వరి పంటను తొక్కి నాశనం చేయగా ప్రకాష్, ఈశ్వరయ్య, దేవేంద్ర, రాధకు చెందిన మామిడి తోటల్లో చెట్ల కొమ్ములను విరిచేశాయి. అలాగే కుమారస్వామికి చెందిన అరటి పంటను తొక్కి ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు. సుమారు 14 ఏనుగులు సమీపంలోని తమిళనాడు అటవీ ప్రాంతం నుంచి పంట పొలాలపైకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం అటవీశాఖ అధికారులు పరిశీలించారు. నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. పంటలపైకి ఏనుగులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


మామిడి తోటలో కొమ్మలు విరిచేసిన ఏనుగులు

దేశం గర్వించే మహనీయుడు సంజీవయ్య

- కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి
- నివాళులు అర్పించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : దేశం గర్వించే గొప్ప మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య 104వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జయంతి కార్యక్రమం నిర్వహించామన్నారు. మారుమూల ప్రాంతంలో జన్మించిన సంజీవయ్య దేశం గర్వించే స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. సీఎం హోదాలో ఆయన బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సేవలందించారని తెలిపారు. ఏపీకి తొలి దళిత ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయమన్నారు. అనంతరం పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మేయర్ అముద, డీపీఎంసీ సభ్యులు మునీంద్ర, రాజ్‌కుమార్, మునస్వామి, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఈఓ వరలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య పాల్గొన్నారు.

కోడి పందాల కేసులో ఏడుగురు అరెస్టు


అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరు పరుస్తున్న పోలీసులు

నగరి : మున్సిపల్ పరిధి కాకవేడు మిట్టిండ్లు వద్ద కోడి పందాలు ఆడుతుండగా ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కోళ్లు, రూ.630 నగదు స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ 35/2025 సెక్షన్ 9 (1) మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.500 వంతున జరిమానా విధించారు.

పేటలో మద్యం షాప్ వద్దు?

- నిరాకరిస్తున్న బీఎన్ఆర్‌పేట గ్రామస్తులు, జనసేన నేతలు
- ఊళ్లో మద్యం షాపునకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు మండలంలోని బీఎన్ఆర్‌పేట గ్రామంలో మద్యం షాపు వద్దని గ్రామస్తులు, జనసేన నేతలు కొందరు మండిపడుతున్నారు. గ్రామస్తుల వివరాల మేరకు... ఇటీవల ఐరాల మండలానికి చెందిన ఓ వ్యక్తికి షాపు దక్కింది. ఆ వ్యక్తి పేరుతో బంగారుపాళ్యంకు చెందిన ఓ కూటమి నేత బినామీగా వ్యవహరిస్తూ శుక్రవారం బీఎన్ఆర్‌పేటలో షాపు తెరిచారనే ఆరోపణలు వస్తున్నాయి. తొలుత బీఎన్ఆర్‌పేట చెక్‌పోస్టులో షాపు పెట్టాలనుకున్నారు. ఆ ప్రాంతాన్ని ఆనుకుని హైవే రోడ్డు ఉండడంతో అక్కడ పెట్టేందుకు కుదరలేదు. ఆ తర్వాత తన షాపుల్లోనే పెట్టాలని ఇద్దరు నేతలు పోటీ పడ్డారు. వారి పోరు పడకలేక ఆ రెండు షాపులు వద్దని బీఎన్ఆర్‌పేట గ్రామంలోని ఓషాపులో పెట్టాలని ఫిక్స్ అయ్యారు. అయితే గ్రామస్తులు, జనసేన నేతలు ఊళ్లో షాపు వద్దని అడ్డుపడ్డారు. గ్రామస్తులు, జనసేన నేతలు కొందరు ఏకమై షాపునకు వ్యతిరేకంగా శుక్రవారం రాత్రి సంతకాల సేకరణ చేశారు. కాగా ఈ మద్యం షాపు కూడలి మీదుగా జిల్లా ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. షాపునకు కూతవేటు దూరంలో ప్రైవేటు , ప్రభుత్వ కళాశాల ఉండడం గమనార్హం. ఈ విషయంపై శనివారం సంబంధిత శాఖ అధికారులు, కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి


రొంపిచెర్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ వెంకటేశ్వరి

రొంపిచెర్ల : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాళ్యంవీధి, రొంపిచెర్ల-1 అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ , బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకు కూరలతో మంచి భోజనం పెడుతున్నారని తెలిపారు. బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు మోను ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు అందుతున్నాయా లేదానని తెలుసుకున్నారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఎస్ఓ సుజాత, సీడీపీఓ మల్లీశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాంగాడులో కార్డన్‌సెర్చ్


సీజ్ చేసిన చోరీ బైకులను చూపుతున్న డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

నగరి : మండలంలోని మాంగాడు గ్రామంలో డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కార్డన్‌సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ తనిఖీలో రికార్డులు లేని పది చోరీ మోటారు బైక్‌లు, 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులకు సారా అమ్మకాల వలన కలిగే నష్టాల గురించి, చోరీ బైకులు కొంటే కలిగే ఇబ్బందుల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మహేశ్వర్, పోలీసులు పాల్గొన్నారు.

ఎస్వీ జూలో స్నేక్ రిస్క్యూ ట్రైనింగ్

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో శని, ఆదివారాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజుల పాటు అటవీశాఖ, చెన్నై క్రోకోడైల్ బ్యాంక్, సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్నేక్ రిస్క్యూ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి స్నేక్ ట్రైనర్స్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామి వారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం 60,203 మంది శ్రీవారిని దర్శించుకోగా, 21,793 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు లభించినట్లు అధికారులు తెలిపారు.

భగ్గుమన్న బెగ్గిలపల్లి !

- టీడీపీ కుట్రకు అడ్డుపడినందుకు అక్రమ కేసులు!
- ఊరంతా ఏకమైనా తప్పని బెదిరింపుల పర్వం


చంద్రబాబుకు వినతి అందజేస్తున్న బెగ్గిలపల్లి ఊరి గౌడు మునెప్ప

కుప్పం : గుడుపల్లె మండలం బెగ్గిలపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు వివాదం చినికి చినికి గాలివానై భగ్గుమంటోంది. మల్లేశ్వరస్వామి కొండకు మంజూరైన రోడ్డును మళ్లించే టీడీపీ కుట్ర నిర్ణయానికి అడ్డుపడినందుకు ఊరి గౌడు, దండోరదారుడుపై గుడుపల్లె పోలీసులు స్టేషన్‌లో రెండు రోజులుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శుక్రవారం బెగ్గిలపల్లి ఊరి గౌడు మునెప్ప, దండోదారుడు శంకరప్పతో పాటు మరో వ్యక్తి లోకేష్‌పై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల పర్యవసానంపై బెగ్గిలపల్లి గ్రామం భగ్గుమంటోంది. గ్రామ నడిబొడ్డున మల్లేశ్వరస్వామి కొండకు మంజూరైన రోడ్డు మార్చేసి బీడుగా ఉన్న భూముల మధ్య రోడ్డు వేయాలని టీడీపీ నాయకులు పట్టుపట్టడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తున్నాయి. కొందరు టీడీపీ నాయకులు కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఈ రోడ్డు మార్చేశారని ప్రజల నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఈ భూములకు కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుంచి రోడ్డు వేస్తే బీడు భూములకు విలువ పెరుగుతుందని రియల్ వ్యాపారులు భావించారు. దీంతో టీడీపీ నాయకులు రూ.1.5 కోట్లతో బెగ్గిలపల్లి నుంచి మల్లేశ్వర స్వామి కొండకు వేసే రోడ్డును మళ్లించేందుకు కుట్రలు చేశారు. దీంతో బెగ్గిలపల్లి గ్రామస్తులు ఏకమై టీడీపీ నేతలు చేస్తున్న అన్యాయాన్ని గ్రామంలో వ్యతిరేకించి టీడీపీ సమావేశాలకు వెళ్ల కూడదని దండోరా వేశారు. దీన్ని ఆగ్రహించి టీడీపీ నేతలు దండోరా వేయమని చెప్పినందుకు గ్రామ గౌడు మునిరత్నం అనే మునెప్ప, దండోరదారుడు శంకరప్పను పోలీసులు అదుపులోకి తీసుకుని రెండు రోజులు విచారణ చేపట్టారు.

టీడీపీని వ్యతిరేకిస్తే కేసులు తప్పవు..

బెగ్గిలపల్లి గ్రామ గౌడు మునెప్ప టీడీపీకి క్రియాశీల కార్యకర్త, 30 ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతూ గ్రామ గౌడుగా ఉన్నారు. కానీ అధికార పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించినందుకు మునెప్ప, శంకరప్పపై కేసులు తప్పలేదు. 150 కుటుంబాలకు గౌడుగా వ్యవహరిస్తున్న మునెప్పపై కేసు నమోదు చేయడంపై గ్రామంలో కూటమి ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజల ప్రయోజనాలు పక్కన పెట్టడంతో పాటు రోడ్డును ఎందుకు మారుస్తారని ప్రశ్నించినందుకు టీడీపీ క్రియాశీలక కార్యకర్తలను సైతం వదలపెట్టలేదు.మల్లేశ్వర స్వామి దేవస్థాన రోడ్డు విషయం చివరకు కేసులు వరకు వెళ్లడంపై కుప్పంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

'రేషన్' స్మగ్లింగ్‌కు 'ఖాకీల' దన్ను !

- స్మగ్లర్ల నుంచి భారీగా డబ్బుల డిమాండ్?
- విషయం ఎస్పీకు తెలియడంతో ఇద్దరిపై వేటు
- తాలూక స్టేషన్‌లో పోలీసులపై అవినీతి ఆరోపణలు

చిత్తూరు అర్బన్ : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని స్మగ్లింగ్ చేస్తున్న నిందితులకు కొందరు పోలీసులు అండగా నిలుస్తున్నారు. చిత్తూరు నగరంలోని మురకంబట్టులో పట్టుకున్న రేషన్ బియ్యం వ్యవహారంలో తాలూక పోలీసుల ప్రమేయంపై ఆరోపణలు గుప్పుమన్నాయి. గురువారం మురకంబట్టులోని ఓ గోదాంలో ఒక్కో బస్తాలో 50 కిలోల బియ్యం చొప్పున 176 బస్తాలు, 25 కిలోల చొప్పున 65 బస్తాల బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ, పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. 10 వేల కిలోలకు పైనే ఉన్న ఈ బియ్యం స్మగ్లింగ్‌లో బద్రినారాయణ అనే ప్రధాన నిందితుడితో పాటు శక్తివేల్ అనే ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసిన విషయం బుధవారమే తాలూక పోలీసుల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో నిందితులను తప్పించడానికి పోలీసులు భారీగా డబ్బులను డిమాండ్ చేసినట్లు సమాచారం. బేరం కుదుర్చుకుని, డబ్బులు ఇచ్చేలోపు పౌరసరఫరాల అధికారులు రంగ ప్రవేశం చేయడంతో విషయం వెలుగు చూసింది. దీంతో గురువారం ఉదయం 9 గంటలకు మళ్లీ ఏం తెలియనట్లు తాలూక పోలీసులు గోదాం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం వరకు ఎస్పీకి విషయాన్ని చెప్పకుండా రహస్యంగా ఉంచారు. ఆలస్యంగా సమాచారం అందుకున్న ఎస్పీ మణికంఠ.. ఈ వ్యవహారంపై ప్రాథమిక నివేదిక తెప్పించుకున్నారు. తాలూక స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ పోలీసు అధికారిని తన వద్దకు పిలిపించుకుని తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఆపై తాలూక ఎస్ఐ రమేష్‌ను వీఆర్‌కు పంపుతూ, ఇదే స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శేఖర్‌ను నగరి స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక తాలూక స్టేషన్‌లో ఐడీ పార్టీ పేరిట కొందరు సిబ్బంది మురకంబట్టు, మంగసముద్రం ప్రాంతాల్లో పేకాట ఆడించడం, క్రికెట్ బెట్టింగు నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొందరిని ఇతర స్టేషన్లకు బదిలీ చేసినా.. అటాచ్‌మెంట్ పేరిట మళ్లీ తాలూక చెంతకే చేరుతున్నారు. చిత్తూరు పరిసరాల్లో జరుగుతున్న తమ్మారు రోడ్డు పనుల్లో నెలనెలా భారీగా ముడుపులు అందడం, తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న కూటమి నేతల నుంచి మామూళ్లు తీసుకోవడం తాలూక స్టేషన్‌లో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బందికి వరంగా మారింది. ఒకరిద్దరిని ఇక్కడి నుంచి బదిలీ చేసినంత మాత్రన అవినీతి ఆరోపణలు తుడిచిపెట్టుకుపోయేలా కనిపించడంలేదు. తాలూక స్టేషన్ పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తే తప్ప గాడినపడే అవకాశం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పొరుగు దిష్టి.. పంటాపంచల్ !



పలమనేరు ప్రాంతంలో ఎక్కువగా కూరగాయల పంటలు సాగు చేస్తుంటారు. రైతులు పండించిన పంట బాగుంటే దిష్టి పడుతుందేమోనని ఇప్పటి దాకా దిష్టి బొమ్మలను పెట్టేవారు. కానీ గంగవరం మండలానికి ఆనుకొని ఉన్న కర్ణాటక రాష్ట్రం నంగిళికి చెందిన ఓ రైతు తన క్యాబేజీ తోటకు దిష్టి తగలకుండా సినిమా హీరోయిన్ ఫొటోలను పెట్టాడు. దీన్ని చూసిన దారిన పోయే జనం ఇదేం విడ్డూరమని నోరెళ్లబెడుతున్నారు. - పలమనేరు